ప్రజాశక్తి
శుక్రవారం 11 ఏప్రిల్ 2025
5
శ్రీ సత్యసాయి





పాలసముద్రం వద్ద ఐఎంఎఫ్ఎల్ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

రాష్ట్రంలో నాణ్యమైన మద్యం విక్రయాలు

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-గోరంట్ల

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతను ఇస్తూ నాణ్యమైన మద్యం విక్రయాలు చేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. గోరంట్ల మండలంలో పాలసముద్రం వద్ద రూ.1.25 కోట్లతో నిర్మించిన ఐఎంఎఫ్ఎల్ డిపో గోడౌన్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితమ్మ, ఎమ్మెల్యేలు కందికుంట వెంకట ప్రసాద్, ఎమ్మెస్.రాజు, పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా 3500 మద్యం దుకాణాల కేటాయింపు చేపట్టామని తెలిపారు. మద్యం గోడౌన్ నుంచి వెళ్లే ప్రతి వాహనాన్ని ట్రాక్ చేసేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు చెప్పారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యాన్ని అరికట్టడం ద్వారా రాష్ట్రంలో 30 నుంచి 40 శాతం అమ్మకాలు పెరిగాయన్నారు. మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులను అమలు చేస్తున్నామన్నారు. జగన్ పాలనలో కల్తీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలు తీశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో 13 రకాల పరీక్షలు చేసిన తరవాతే మద్యం బాటిళ్లను షాపులకు తరలిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా 4000 రూపాయల పింఛన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇస్తున్నామన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కల్తీ మద్యాన్ని విక్రయించడం ద్వారా కొందరు మతిస్థిమితి కోల్పోగా మరికొందరు మరణించారన్నారు. కూటమి ప్రభుత్వం రూ.99కే నాణ్యమైన మద్యాన్ని విక్రయిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా బీసీ సంక్షేమానికి 48 వేల కోట్ల బడ్జెట్ కేటాయించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర రెవెన్యూ, ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్ కుమార్, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ అనసూయ దేవి, ఎక్సైజ్ డిసి నాగ మద్దయ్య, ఆర్డీవో సువర్ణ పాల్గొన్నారు.

పోలీస్ పొలిటికల్ ఫైట్

◆ ఆజ్యం పోసిన ఎస్ఐ సుధాకర్ యాదవ్ వ్యాఖ్యలు

◆ అధికారపార్టీకి పోలీసుల మద్దతంటూ వైసిపి విమర్శలు





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో పోలీసుల పొలిటికల్ ఫైట్ జోరుగా సాగుతోంది. రామగిరి మండల ఎంపిపి ఎన్నిక సమయంలో ప్రారంభమైన ఈ వివాదం అంతకంతకు పెరుగుతూపోతోంది. వైసిపి ఎంపిటిసిలను ప్రలోభపెట్టే ప్రయత్నం రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ చేసారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ వివాదం నడుస్తున్న సమయంలో పాపిరెడ్డిపల్లిలో జరిగిన హత్యలో పోలీసులపై ప్రతిపక్ష వైసిపి విమర్శలు మరింతగా పెరిగాయి. వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పోలీసుల తీరును తప్పుబడుతూ, తప్పుచేసిన వారిని చట్టం ముందు బట్టలు ఊడదీసి నిలబెడతామని హెచ్చరించారు. ఈ హెచ్చరికలపై రాజకీయ రచ్చ నడుస్తోంది. అధికార పార్టీ నాయకులు ఏ రకంగా పోలీసుల బట్టలూడదీస్తావంటూ మండి పడుతున్నారు. ఈ వివాదం వారి మధ్య నడుస్తున్న క్రమంలోనే రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ ఏ రకంగా బట్టలూడదీస్తావు జగన్ అంటూ చేసిన వీడియో ఒకటి వైరల్ అయింది. ఆయన వ్యాఖ్యలతో ఈ రాజకీయ దుమారం మరింత ఎక్కువైంది.

పోలీసులపై వ్యాఖ్యలు సరికాదు
త్రిలోక్, పోలీసు అధికారుల సంఘం నాయకులు.

పోలీసుల బట్టలూడదీస్తామని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు సరైనవి కాదని పోలీసుల అధికారుల సంఘం నాయకులు త్రిలోక్ తెలిపారు. జగన్ పర్యటన సందర్భంగా పోలీసు భద్రత కట్టుదిట్టంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్కువ మంది వైసిపి శ్రేణులు వచ్చినా ఎక్కడా ఎటువంటి చిన్నపాటి ఘటన చోటు చేసుకోకుండా ఎంతో సమన్వయంతో పనిచేసామన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పనిచేసింది కూడా ఇదే పోలీసులేనని చెప్పారు. విధి నిర్వహణలో నిత్యం కష్ట పడుతున్న పోలీసులను కించ పరిచే విధంగా జగన్ మాట్లాడటం సరైంది కాదని ఆయన తెలిపారు.

నెత్తిన టోపి, డ్రస్ సిగ్గుపడుతోంది
మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

సుధాకర్ యాదవ్ ఎంపిపి ఎన్నికల సమయంలో వ్యవహరించిన తీరు చూస్తే నెత్తి మీద టోపి, వేసుకున్న డ్రస్ కూడా సిగ్గుపడుతుందని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విమర్శించారు. పోలీసు వాహనంలో రాళ్లు, కట్టెలు పెట్టుకుని వచ్చింది కాక, వాటిని బాధితుల వాహనాల్లో చూపించి కేసులు నమోదు చేసారని ఆరోపించారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా 1200 మంది భద్రతను ఏర్పాటు చేసామని పోలీసులు అధికారులు చెబుతున్నారన్నారు. వచ్చిన 1200 పోలీసుల్లో సగం మందిని పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద, పాపిరెడ్డిపల్లి గ్రామంలో నిందితుల రక్షణకు పెట్టారని ఆరోపించారు. జగన్‌కు ఏర్పాటు చేయాల్సిన మూడంచెల భద్రతను ఏర్పాటు చేయకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. భద్రతా సరిగా కల్పించకుండా రోడ్డు మార్గంలో వెళ్లే విధంగా చేసి ఆయనపైన దాడి చేయాలన్నది టిడిపి ఉద్దేశంగా ఉందన్న అనుమానం కలుగుతోందని చెప్పారు.

గోరంట్ల మాధవ్ అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం

హిందూపురం మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను గుంటూరు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. చెబ్రోల్ కిరణ్‌పై దాడికి యత్నించారన్న ఉద్దేశంతో అరెస్టు చేశారు. చెబ్రోలు కిరణ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులపై అనుచితంగా మాట్లాడారన్న దానిపై పోలీసులు గురువారం నాడు అరెస్టు అతన్ని అరెస్టు చేశారు. అరెస్టు చేసి తీసుకెళుతున్న సమయంలో ఆయనపై దాడికి గోరంట్ల మాధవ్ ప్రయత్నించినట్టు తెలుస్తోంది. ఆ సమయంలోనే ఆయన్ను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు.



నిరసనలో భాగంగా అదానీ పరిశ్రమ ప్రధాన రోడ్డుపై చీనీకాయలు పడేసిన రైతులు

పంటకు 'అదానీ' పోటు..!

అదానీ హైడల్ ప్రాజెక్టు వద్ద చీనీకాయలు పారేసి రైతుల నిరసన

ప్రజాశక్తి-తాడిమర్రి

తాడిమర్రి మండలంలో అదానీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న హైడల్ పవర్‌ప్రాజెక్టు రైతుల జీవితాల్లో చీకట్లను నింపుతోంది. పరిశ్రమ వద్ద ఏర్పాటు చేస్తున్న మట్టి కుప్పలు, కంకర మిషన్ల వల్ల వెదజల్లుతున్న పొడితో దాడితోట, పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామాల పంట పొలాల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. తమకు జరుగుతున్న అన్యాయాన్ని పరిశీలించి న్యాయం చేయాలని సమీప గ్రామాల రైతులు ఎన్ని సార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అదానీ పరిశ్రమ కాలుష్యం వల్ల దెబ్బతిన్న చీనీ కాయలను పరిశ్రమ ప్రధాన రహదారిపై వేసి గురువారం నాడు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అదానీ పవర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా అక్కడ నిల్వ ఉంచుతున్న మట్టి కుప్పలు, కంకర మిషన్ల నుంచి వస్తున్న దుమ్ము, ధూళితో సమీప గ్రామాల్లో సాగు చేస్తున్న అరటి, దానిమ్మ చీనీ పంటల దెబ్బతింటున్నాయన్నారు. ఈ చెట్లపై దుమ్ము పేరుకుపోవడంతో కాత రావడం లేదన్నారు. కాయలు కాసినా అవి పెద్దగా అవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరిగా లేని కాయలను కొనేందుకు ఏ వ్యాపారీ ముందుకు రావడం లేదన్నారు. ఈ సమస్యపై గతంలో రెండు,మూడు సార్లు ఆందోళన చేసిన అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందిచకుంటే తమ పంట పొలాలన్నీ బీడుగా మార్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు



పుట్టపర్తిలో వినూత్న నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, మహిళలు



పెనుకొండలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఇప్పటికే కొనుగోలు శక్తి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకోవాల్సింది పోయి కేంద్రంలోని మోడీ ప్రభుతవం గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి మరింత భారం వేస్తోందని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా పలు మంల కేంద్రాల్లో గురువారం నాడు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పుట్టపర్తి పట్టణంలోని గణేష్ సర్కిల్‌లో సిపిఎం, సిఐటియు నాయకులు గ్యాస్ సిలిండర్లను నెత్తిన పెట్టుకని ధర్నా నిర్వహించారు. 'పెరిగే ధరలకు హద్దే లేదు.. పెంచే వారికి బుద్దే లేదు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని విమర్శించారు. సామాన్య ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు ధరలు పెంచడం సరికాదన్నారు. తక్షణం పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, కొత్తచెరువు కార్యదర్శి ముత్యాలు, వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి వెంకటేష్, మహిళా సంఘం నాయకులు రమాదేవి, శ్రావణి పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్,డీజిల్,ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నందు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు హరి, బాబావలి, గంగాధర్, మహబూబ్ బాషా మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ లపై 50 రూపాయలు ఒకేసారి పెంచి పేద ప్రజల పైన మోయలేని భారాన్ని వేశారన్నారు. పెంచిన పెట్రో ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను, రైతులను,కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు,నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట రాముడు, రాజు రావు, ఆరిఫ్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం, ఐద్వా ఆధ్వర్యంలో కదిరి అంబేద్కర్ సర్కిల్లో నిరసన తెలిపారు. గ్యాస్ సిలిండర్లను రోడ్డుపై ఉంచి నిరసన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు దారుణం అన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల భారాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వాలు మరింత భారాలు మోపడం సరికాదన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కదిరి పట్టణ కార్యదర్శి జిఎల్.నరసింహులు, నాయకులు జగన్మోహన్, బాబ్‌జాన్, ముస్తాక్, రామ్మోహన్, శివన్న, ఆంజనేయులు, నారాయణ, రఫీ, రమణమ్మ, మున్ని, సుధాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

చిలమత్తూరు :కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. 'మేము భారాలు మోయలేం' అంటూ ఖాళీ గ్యాస్ సిలిండర్లను తలపై పెట్టుకుని, ఆటోకు తాడు కట్టి లాగుతూ నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెను భారంగా మారిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాను ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ఒకేసారి రూ.50 పెంచి ప్రజలపై పెనుభారం మోపారన్నారు. మోడీ ప్రభుత్వం అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామచంద్ర, మంజునాథ్, నరసింహ, చరణ్, భూమరెడ్డి, రహమత్తుల్లా, నాగరాజు, రజీయా బాను, సావిత్రమ్మ, ఆదిలక్ష్మమ్మ, నరసమ్మ, ఆంజి, ఆటో కార్మికులు రామాంజి, పాల్గొన్నారు.

యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-మడకశిర

ఏపీఆర్జేసీ, పాలీసెట్, ఎంజెపి, ఆర్టీటీ సెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కెపిలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు గురువారం సమావేశమయ్యారు. పట్టణం లోని సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ భవనమునందు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12 తేదీన ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పదవ తరగతి పరీక్ష రాసినటువంటి విద్యార్థులందరూ తమ హాల్ టికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తో ఉపాధ్యాయ భవనంలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి డి. నరసింహప్ప, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివిఎస్. మాలింగప్ప, వై. జోగప్ప, గుడిబండ మండలం అధ్యక్షులు మూడ్ల గిరియప్ప, నాయకులు నరసింహమూర్తి, కదిరిన్న, దేవరాజు, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌గా శ్యాంసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు మండల వైసిపి కన్వీనర్‌గా తలమర్ల మాజీ సర్పంచి ఎస్.శ్యాంసుందర్ రెడ్డిని అధిష్టానం నియమించింది. ఇటీవల పుట్టపర్తిలో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. వారందరి అభిప్రాయం మేరకు శ్యాంసుందర్‌రెడ్డిని కన్వీనర్‌గా ఎంపిక చేశారు.

జైన్‌లో విద్యాదశ స్నాతకోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలోని జైన్ పాఠశాలలో తొలి విద్యాదశ (ప్రీ ప్రైమరీ) స్నాతకోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వర్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే చిన్నారులకు నైతిక విలువలను బోధించాలన్నారు. విద్యపై మక్కువ పెంచేలా బోధన చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం చిన్నారుల చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి.

అనధికారికంగా నిర్మించిన షెడ్లను తొలగించండి



సమస్యలను వీరయ్యకు వివరిస్తున్న ఛైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక శాఖకు సంబంధించిన ప్రైవేట్ బస్ స్టాండ్ ఆవరణంలో అనధికారికంగా నిర్మాణం చేసిన షెడ్లను వెంటనే తొలగించుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ కూరగాయల టోకు వ్యాపారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం బాలయ్య పిఏ వీరయ్య తో కలిసి ప్రయివేటు బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన టోకు వ్యాపారుల షెడ్లను పరిశీలించారు. అదే విధంగా మార్కెట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణంలో కూరగాయల టోకు వ్యాపారులు షెడ్లను నిర్మాణం చేసుకోవడంతో బస్టాండ్ ఆవరణం కుచించుకుపోయింది. వెంటనే వాటిని తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఛైర్మన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాఘవేంద్ర, ఎంహెచ్ఒ శోభన్ రెడ్డి, టిడిపి నాయకులు వెంకటేష్, శీనా, ఎన్‌బికె ఫ్యాన్స్ కన్వీనర్ నంబూరి సతీష్, జనసేన నాయకులు నిమ్మకాయల రాము తదితరులు పాల్గొన్నారు.

షెడ్లు సరే... పూల వ్యాపారుల సంగతేంటి...?

హిందూపురం పురపాలక సంఘంలో గత మూడు సంవత్సరాలుగా నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనాలు, కూరగాయల మార్కెట్, బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలం, వాణిజ్య సముదాయ భవనాలు, మార్కెట్ భవనాల కింద ఉన్న స్థలం అటు మున్సిపల్ పాలకవర్గానికి, అధికారులకు కనక వర్షం కురిపించింది. ప్రస్తుతం బస్టాండ్ ఆవరణంలో టోకు వ్యాపారులు నిర్మాణం చేసుకున్న షెడ్ల విషయంలో కూడా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మునిసిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ బస్టాండ్ ఆవరణంలో అనాధికారికంగా నిర్మాణం చేసుకున్న షెడ్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అయితే దాదాపు రెండు సంవత్సరాలుగా ఒక్క పైసా కూడా పురపాలక సంఘానికి చెల్లించకుండా పూల వ్యాపారులు నూతన మార్కెట్ భవనం కింద పార్కింగ్ స్థలంలో పూల వ్యాపారాలు చేస్తున్నారు. పూల వ్యాపారుల నుంచి భారీగా ప్రస్తుత పాలకవర్గం ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందువల్లే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. పాలకవర్గానికి చిత్తశుద్ధితో ఉంటే వెంటనే అనధికారికంగా పురపాలక స్థలంలో వ్యాపారం చేసుకుంటున్న పూల వ్యాపారులపై చర్యలు తీసుకుని, మున్సిపల్ నిబంధనల మేరకు దాదాపు రెండు సంవత్సరాలకు సంబంధించిన పన్నుతో పాటు అద్దెలను వసూలు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇలా చేస్తే పురపాలక సంఘానికి లక్షలాది రూపాయల ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయి. అయితే పాలకులు అధికారులు కలిసి పురపాలక సంఘానికి రావలసిన ఆదాయాన్ని గండికొట్టి తమ జేబులను నింపుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వెంటనే ఈ విషయంలో బాలయ్య పిఏ వీరయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పూల వ్యాపారులపై చర్యలు తీసుకొని పురపాలక సంఘ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రి పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కాయకల్ప బృందం గురువారం పరిశీలించింది. విజయవాడ నుంచి వచ్చిన కాయకల్ప బృందం వైద్యులు రామారావు, నరేష్, క్వాలిటీ కంట్రోలర్ సుబ్రహ్మణ్యం తదితరులు ఆసుపత్రినిపరిశీలించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఏటా అందించే కాయకల్ప అవార్డు ఎంపిక కోసం ఇంటర్నల్ అసెస్మెంట్ లో భాగంగా బృందం సభ్యులు ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ లింగన్న మాట్లాడుతూ ఆసపత్రిని కాయకల్ప బృందం సందర్శించిందని, త్వరలో మరో బృందం వస్తుందని అన్నారు. హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి గత కొన్ని సంవత్సరాలుగా కాయకల్ప గుర్తింపు వస్తుందని చెప్పారు. ఈ సంవత్సరం సైతం గుర్తింపు లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో వీరితో పాటు వైద్యులు వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగనీయొద్దు

ప్రజాశక్తి - చిలమత్తూరు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై చర్యలు తీసుకోవాలని సుందరయ్య కాలనీ ప్రజలు పోలీసులను కోరారు. ఈ మేరకు ఎస్ఐ మునీర్ అహ్మద్‌ను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. కొడికొండ చెక్‌పోస్ట్‌లోని సుందరయ్య కాలనీ రాత్రి వేళల్లో ఆకతాయిలు మద్యం సేవిస్తున్నారని చెప్పారు. మద్యం మత్తులో కొందరు దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. పోలీసులు స్పందించి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రవీణ్, వెంకటేష్, రామచంద్ర, సుందరయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌స్కిల్స్‌పై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ కుమార్ తెలిపారు.ఈ ఉచిత శిక్షణ 30 రోజులు పాటు ఉంటుందని,డిగ్రీ 3వ సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం బెంగళూరుకు చెందిన ఉన్నతి ఆర్గనైజేషన్ యునెస్ట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాఫ్ట్ స్కిల్స్ పైన ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ బాలాజీ నాయక్, కళాశాల కరెస్పాండెంట్ సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్య ప్రకాష్, ఎఒ జయ చంద్రా రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి రాయలసీమ కోఆర్డినేటర్, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డిని హిందూపురం వైసిపి నాయకులు గురువారం కలిశారు. పురం వైసిపి నాయకులు కొండూరు వేణుగోపాల్ రెడ్డి, కొటిపి హనుమంత్ రెడ్డి, శెట్టిపల్లి జగన్మోహన్ రెడ్డి తదితరులు తిరుపతిలో పెద్దిరెడ్డిని, మిథున్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారుహిందూపురం నియోజకవర్గం లో పార్టీ పరిస్థితి, కార్యకర్తలను ఆదుకొంటున్న అంశం తదితర విషయాలపై చర్చించారు. పార్టీలో కష్టపడి పని చేసే నాయకులకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని, కార్యకర్తలకు అండగా ఉంటూ విభేదాలకు అవకాశం లేకుండా ఐక్యతతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నేతలు స్థానిక నాయకులకు సూచించారు.

ప్రజాశక్తి www.prajasakti.com

సంత వేలంపాట

ప్రజాశక్తి-నల్లచెరువు

నల్లచెరువు గ్రామ పంచాయతీ వారపుసంత వేలం పాటను పంచాయతీ అధికారులు గురువారం నిర్వహించారు. నల్లచెరువు సర్పంచి బి.పంచరత్నమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నల్లచెరువుకు చెందిన వి.ఎం.బాషా, అత్యధిక పాట పాడి సంతను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

గరుడవాహనంపై లక్ష్మీనారాయణుడు

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహనంపై లక్ష్మీనారాయనుడు గురువారం ఊరేగాడు. గరుడ వాహన సేవ సందర్భంగా ఉదయాన్నే లక్ష్మీనారాయణ స్వామి మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ప్రధాన అర్చకులు హరిస్వామి ఆధ్వర్యంలో గరుడ వాహన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గరుడ వాహనంపై కొలువుదీరిన లక్ష్మీనారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. (శుక్రవారం సాయంత్రం కళ్యాణోత్సవం జరగనుంది.

సురక్షిత నీటిని అందిస్తాం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం నాడు పోతుకుంట గ్రామంలో రివర్స్ ఆస్మోసిస్ ప్లాంట్‌ను ఏర్పాటు పనులను గురువారం ప్రారంభించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్ బాబు హాజరై భూమిపూజ నిర్వహించారు. ప్రజలకు సురక్షత నీటిని అందించేందుకు ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతుకుంట రాజు, జయరాం, సూరి, బిల్లే శ్రీనివాసులు, మహేష్, రామయ్య పాల్గొన్నారు.

నేత్రదానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన పూజారి వెంకటరాముడు గురువారం అకస్మాత్తుగా మృతిచెందాడు. దీంతో మృతుని కుమారులు పూజారి జగదీష్, పూజారి గిరిధర్, అన్న పూజారి నారాయణ, కుటుంబ సభ్యులు మృతుని నేత్రాలను దానం చేయాలని తలంచారు. యువర్స్ ఫౌండేషన్ సంస్థకు సమాచారాన్ని అందించారు. దీంతో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు శీలా నాగేంద్ర, డాక్టర్ సుబ్బారావు, మాజీ అధ్యక్షులు వైకె శ్రీనివాసులు, రెడ్ క్రాస్ టెక్నీషియన్ రాఘవేంద్ర, భాస్కర్, టెక్నీషియన్ సికిందర్ మృతుని నేత్రాలను సేకరించారు.

ఘనంగా మహావీర్ జయంతి

ప్రజాశక్తి - పావగడ

పట్టణంలోని శిరారోడ్డులోని జైన్ షాపు ఎదుట గురువారం భగవాన్ మహావీర జయంతిని నిర్వహించారు. జైన సమాజమ్ ఆధ్వర్యంలో మహావీరుని చిత్రపటానికి నివాళులర్పించారు.

సంత గుత్తేదారులపై వ్యాపారుల ఆగ్రహం



పంచాయతీ కార్యాలయం ముందు వ్యాపారుల నిరసన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలో నిర్వహించే సంతను గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వేలం పాడుకుని వ్యాపారులపై గతంలో కంటే మూడింతలు అధికంగా పన్ను వసూలు చేస్తున్నారంటూ సంతలో వ్యాపారం చేసుకునే వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల సంత వేలం వేయగా రూ. 18.07 లక్షలకు వేలం దక్కించుకున్న వ్యక్తి మరో వ్యక్తికి గుడ్ విల్ రూపంలో అమ్మాడన్నారు. అతను గతంలో 100 రూపాయలు వసూలు చేసే అంగడికి 300 రూపాయలుగా నిర్ణయించాడని 300 రూపాయలను 600 రూపాయలుగా, 600 రూపాయలు అంగడికి 12 వందలుగా నిర్ణయించి వ్యాపారుల దగ్గర ఇస్తారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని గోరంట్లకు చెందిన వ్యాపారి సునంద, కురవాండ్లపల్లికి చెందిన వ్యాపారి శాంతమ్మ, కదిరికి చెందిన అరటి పండ్ల వ్యాపారి బాబా ఫక్రుద్దీన్‌తో పాటు రఫిక్, అంజలి, వెంకటేష్ తదితర వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. తోపుడు బండికి గతంలో 50 రూపాయలు వసూలు చేస్తుంటే 200 రూపాయలు వసూలు చేస్తున్నాడని అతి తక్కువ రూ. 200 నుండి రూ. 1500 వరకు కట్టాలని హుకుం జారీ చేస్తున్నాడని వాపోయారు. కుండల వ్యాపారి దగ్గర గతంలో 50 రూపాయలు వసూలు చేస్తుండగా ప్రస్తుతం రూ. 300 ఇవ్వాలని అలా కట్టని వ్యక్తులను సరుకులు దించకూడదని అడ్డుపడటమే కాకుండా వ్యాపారం చేసుకునే స్కేలు ,బ్యాగులు తీసుకువెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చెప్పే విధంగా చెల్లిస్తే గాని సంతకు రండి లేకపోతే రావద్దని గుత్తేదారుడు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడన్నారు. సంతలో అధికంగా మహిళలే వ్యాపారం నిర్వహిస్తామని మహిళలకు అత్యవసరమైన, టాయిలెట్లు గాని, తాగటానికి నీరు కానీ, అందుబాటులో లేవని అదేవిధంగా విచ్చలవిడిగా ఊరి పశువులు సంత మీద పడి వ్యాపారులకు ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు. ఈ సమస్యలన్నీ పట్టించుకోకుండా ఎవరికివారు ఎటువంటి గెజిట్ లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇతనిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులును కోరారు. నిరసన విషయం తెలుసుకున్న పోలీసులు వ్యాపారులతో మాట్లాడారు. ఈవిషయంపై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గుత్తేదారుడు గతంలో ఎంత నిర్ణయించారో అంతే డబ్బులను వ్యాపారుల దగ్గర నుండి డబ్బులు వసూలు చేయాలని అధికంగా వసూలు చేస్తే వారి వేలంపాటను రద్దు చేస్తామని చెప్పారు. వ్యాపారులు ఎట్టి పరిస్థితుల్లోనూ గతం కంటే ఒక్క రూపాయి కూడా ఎక్కువ కట్టవలసిన అవసరం లేదని అన్నారు. వ్యాపారుల దగ్గర నుండి అధికంగా డబ్బులు వసూలు చేస్తే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

పంచాయతీ కార్యాలయం ముందు నిరసన

వేలాన్ని రద్దు చేయాలి : వ్యకాసం

గ్రామపంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా కూరగాయల వ్యాపారస్తుల వద్ద సుంకాలు వసూలు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తేదారుడు బరితెగించి వసూళ్లు చేస్తున్నదానికి గ్రామపంచాయతీ అధికారులే కారణమని విమర్శించారు. బహిరంగ ప్రదేశాలలో సుంకాల ధరలకు సంబంధించి పట్టికలు ఏర్పాటు చేయాలని అనేకమార్లు ప్రజాసంఘాలు , వామపక్ష పార్టీలు విజ్ఞప్తులు చేసిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించారు. ఇప్పటికైనా అధికారులు వారపు సంతలోని పేదలు , కష్టజీవులు, చిన్నపాటి కూరగాయల వ్యాపారుల నుంచి గ్రామ పంచాయతీ గెజిట్ ఆధారంగా సుంకాల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏకతాటిపై ఉన్నాం.. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ను గద్దె దింపుతాం...



సమావేశంలో పాల్గొన్న అసమ్మతి కౌన్సిలర్లు, తదితరులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నీసాపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి తామందరం ఏకతాటిపై ఉన్నామని ఛైర్‌పర్సన్‌ను గద్దె దింపుతామని మున్సిపల్ కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్ కుమార్, కొలిమి జిలాన్ అన్నారు. గురువారం పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథిగృహంలో అసమ్మతి కౌన్సిలర్లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నీసా సాదిక్ వ్యవహార శైలితో కదిరి పట్టణంలో నాలుగేళ్లుగా అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. తామేదో చేస్తామని అప్పట్లో వైసీపీకి పూర్తిస్థాయి మెజార్టీని ప్రజలు ఇస్తే ఓట్లేసి గెలిపించిన ప్రజలకు నాలుగేళ్లు ఏమి చేయలేకపోయామని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కదిరిలో ఛైర్‌పర్సన్‌కు, ఆమె బంధువులకు వైసీపీ సొంత కుటుంబ పార్టీ లాగా మారిందని విమర్శించారు. గతంలో అప్పటి ఎమ్మెల్యే సహకారంతో కనీసం పార్టీలో సభ్యత్వం లేని వ్యక్తిని ఛైర్‌పర్సన్‌ను చేశారని అయినప్పటికీ ఆ ప్రజా ప్రతినిధి మాటకు కట్టుబడి తామందరం ఆమెను ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నామని చెప్పారు. అప్పట్లో అప్పులు చేసి ఎన్నికల్లో గెలిస్తే కనీసం వైసీపీ పెద్దలు తమను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కదిరి మున్సిపాలిటీలో నాలుగేళ్లుగా ఏమాత్రం అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదన్నారు. ఛైర్‌పర్సన్ నజీ మున్నీషా వారి కుటుంబ సభ్యులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై 28 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ఈనెల 23న తేదీ ఖరారు చేశారని చెప్పారు. ఆరోజు ప్రవేశపెట్టబోయే అవిశ్వాస సమావేశానికి హాజరై నజీ మున్నీసాను గద్దె దింపుతామని వారు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు న్యాయం చేయలేకపోయామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కదిరి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడే కూటమి ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. ఈ సమావేశంలో అసమ్మతి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అసమ్మతి కౌన్సిలర్లు

మహిళాభివృద్ధే లక్ష్యం : మంత్రి సవిత

ప్రజాశక్తి - గోరంట్ల

మహిళాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలో కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని ఆమె గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో జీవించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏడాది లక్ష మందికి మూడు నెలల పాటు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి ఒక్కొక్కరికి ఒక్క మిషన్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. గోరంట్ల మండలంలోని5 ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాల్లో శిక్షణ పొందడానికి 640 మంది ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరందరికీ శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు పచ్చ అశోక్, బాలకృష్ణ చౌదరి, నరేష్, వేణు రాయల్, జయరాం తదితరులతో పాటు ఎంపీడీవో నరేంద్ర కుమార్, తహశీల్దార్ మారుతి ప్రసాద్ కూటమి నాయకులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన లేదు

షిర్డిసాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప

ప్రజాశక్తి-పెనుకొండ

తనకు రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన లేదని షిర్డిసాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక రాజకీయ పార్టీ కి పెనుకొండ సమన్వయ కర్తను తానే అంటూ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఇది కేవలం ఊహాజనితమని తనకు రాజకీయాలలో ప్రవేశించే ఆసక్తి గానీ, ఆలోచన గానీ లేదని చెప్పారు. గత 22 సంవత్సరాలుగా షిర్డిసాయి గ్లోబల్ ట్రస్ట్ తరుపున ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తాను సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి పొందుతున్నానని అన్నారు.

క్షయ వ్యాధిపై ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

క్షయవ్యాధి గుర్తింపుపై మండలం దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏలుకుంట్ల గ్రామంలో వైద్య సిబ్బంది గురువారం నాడు ఇంటింటి సర్వే చేపట్టారు. డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ పర్యవేక్షకులు మల్లికార్జున, నాగేంద్ర, ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్ రెడ్డి, ధర్మవరం టీబీ సూపర్‌వైజర్ రహమత్ బాషా పాల్గొన్నారు.

రైతులకు నష్టం వాటిల్లే జీవోలను రద్దు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

రైతులకు నష్టం వాటిల్లే జీవో నెంబర్ 404,405 లను వెంటనే రద్దుచేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు హెచ్ ఎన్ ఎస్ ఎస్ అధికారులను కోరారు. ఈ మేరకు వారు గురువారం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు నిలుపుదల చేసి వెడల్పు చేయాలన్నారు. హంద్రీనీవా ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో మూడు లక్షల 45 వేల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. తాగు, సాగునీరు కొరత తీరి జిల్లా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల వలన రైతులకు త్రీవ నిరాశ ఎదురవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిపాదించిన జీవో నెంబర్ 404,405 ఆచరణలోకి వస్తే హంద్రీనీవా లక్ష్యాన్ని నీరుగార్చినట్టే అవుతుందన్నారు. హంద్రీనీవా కాలువ రావడంతో బోర్లు వేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నా రైతులకు లైనింగ్ పనుల వలన భూగర్భ జలాలు అడుగంటి నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఒక్కసారి లైనింగ్ పనులు జరిగితే భవిష్యత్తులో కాలువ వెడల్పు చేయడానికి అనుకూలంగా ఉండదని అన్నారు. అదేవిధంగా మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులు వెంటనే పూర్తి చేయాలని హంద్రీనీవా కాలువ సామర్థ్యం పదివేల క్యూసెక్కుల పెంచి పిల్ల కాలువల ద్వారా ఉమ్మడి జిల్లాలోని అన్ని చెరువులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి ,మహబూబ్ బాష, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా ప్రభుత్వ అసుపత్రికి వస్తున్న రోగులకు వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది నాణ్యమైన వైద్య సేవలను అందించాలని ఎమ్మెల్యే బాలయ్య పిఎ వీరయ్య ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్ తో కలిసి జిల్లా అసుపత్రిని తనిఖీ చేశారు. అత్యవసర విభాగం నుంచి అన్ని వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడారు. ఈసందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ లింగన్న అసుపత్రిలో ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. సిటీ స్కాన్ ను త్వరలోనే మరమ్మతు చేయించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగు పరచాలని, డయాలసిస్ విభాగంలో అవసరమైనటువంటి ఏ సీ లు, ఫ్యాన్లు, మరి ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని మెడికల్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎన్‌బికె. ఫ్యాన్స్ అసోసియేషన్ కన్వీనర్ నంబూరి సతీష్, టీడీపీ నాయకులు సుమో శీనా తదితరులు పాల్గొన్నారు.

చెరువు తూమురాళ్లు తొలగింపు

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని పంతుల చెరువు మొదటి తూము వద్ద రాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. దీంతో నీరు వృథాగా వెళుతోంది. గమనించిన గ్రామస్తులు ఇరిగేషన్ ఏఈ ఆదెమ్మకు సమాచారం అందించారు. వెంటనే ఆ అధికారిని అక్కడికి చేరుకుని సాగునీటి అధ్యక్షులు, రైతులు, గ్రామస్తులు సహకారంతో తూము నుండి వెళుతున్న వృధా నీటి నివారణకు చర్యలు చేపట్టారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షల తేదీ మార్పు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణ పరిధిలో గుట్ట కిందపల్లి వద్ద గల ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) 2025-26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతికి నిర్వహించే ప్రవేశ పరీక్ష తేదీని మార్పు చేసినట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. ఈ నెల 20వ తేదీ జరగాల్సిన పరీక్షను ఒక రోజు తర్వాత 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నాణ్యమైన విద్యనందిస్తాం : డిఇఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోని గోకులం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో పరిస్థితులను తెలుసుకుని విద్యార్థులతో మాట్లాడారు. త్వరలో ఈ పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మారుస్తున్నట్లు తెలియజేశారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారన్నారు. గతంలో చదువు మానేసి బయట ఉన్న విద్యార్థులను ఎక్కువ మందిని చేర్పించి పాఠశాల అభివద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనంను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఖాదర్ వలీ, ప్రసాద్, సాయినాథ్ శర్మ, ఉపాధ్యాయులు రాధా రాణి, పి.వి.రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఎంఆర్‌సి సిబ్బంది రామ్మోహన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పావగడలో చోరీ

ప్రజాశక్తి - పావగడ

పట్టణంలోని తుమకూరు రోడ్డులోని గంగా ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. షాపు షెల్టర్ తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. అల్మారాలో ఉన్న రూ.83వేల చోరీ చేసినట్లు దుకాణం యజమాని గంగాధర్ తెలిపారు. అదేవిధంగా పక్కనే ఉన్న ఆర్సీఎం షాపులో కిరాణా సామాన్లు, లోదుస్తులు, రూ.12వేలు నగదు చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు చెప్పారు.

బంగారు గొలుసు అపహరణ

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిల్లర దుకాణం నిర్వహిస్తున్న ఇందిరమ్మ అనే మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్ళిన ఘటన బుధవారం కొడికొండ చెక్ పోస్ట్ మొరంపల్లి క్రాస్ వద్ద జరిగింది. అగంతకుడు తనకు కూల్‌డ్రింక్ ఇవ్వాలని చిల్లర కొట్టు లో ఉన్న మహిళ ఇందిరమ్మను అడిగాడు. ఆసమయంలో మహిళకు దగ్గరగా వచ్చిన అగంతకుడు ఇందిరమ్మ మెడలో ఉన్న 3.5 తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. దీంతో బాధితురాలు తనకు జరిగిన అన్యాయాన్ని చిలమత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని సంతేబిదనూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన అశ్వర్థ నారాయణ అనే వ్యక్తి మృతిచెందాడు. అశ్వర్థ నారాయణ గురువారం ఉదయం వాకింగ్ నిమిత్తం గ్రామ సమీపంలో వెళుతుండగా వెనుకవైపు నుండి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అశ్వర్థ నారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. ఢీ కొట్టిన వాహనం వేగంగా వెళ్ళిపోయింది. విషయం తెలిసిన వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రామగిరి ఎస్ఐ పరిటాల ఏజెంట్ : వైసిపి

ప్రజాశక్తి-మడకశిర

రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ ఒక పోలీస్ అధికారిగా కాకుండా కేవలం పరిటాల కుటుంబీకుల ఏజెంట్‌గా పనిచేస్తూ చెప్పిన విధంగా విధులు నిర్వర్తిస్తున్నారని వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి ఆరోపించారు. ఈ మేరకు ఆయన గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధ్యతాయుతమైన అధికారిగా ప్రజలకు రక్షణ కల్పించాల్సింది పోయి కేవలం ఒక వర్గానికే పనిచేస్తున్నారని ఆయన చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రిని ఏక వచన పదజాలంతో మాట్లాడడం తగదన్నారు. ప్రజలు వివిధ రూపాల్లో చెల్లించిన పన్నుతో వేతనాలు తీసుకుంటున్న ఉద్యోగులు పార్టీలకు అతీతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. నిజాయితీతో పని చేసే పోలీసు అధికారులకు ప్రజల్లో ఎప్పటికీ మంచి గుర్తింపు గౌరవం ఉంటుందన్నారు.

పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. రోడ్డు భద్రత పై అవగాహన చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ లకు దూరంగా ఉండాలన్నారు.పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు. పుట్టపర్తి ప్రధాన రహదారిలో అర్బన్ సీఐ సునీత ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక ఎంపియుపి పాఠశాలలో అనంత శక్తి సొసైటీ సీఈవో లావణ్య, అధ్యక్షురాలు సుశీలమ్మ ఆధ్వర్యంలో, మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సమాజంలో మహిళలకు జరుగుతున్న వివక్షత, హింసపై నాటిక ప్రదర్శించారు. మహిళలకు గృహహింస, బాల్యవివాహాలు, సమానత్వం, నిర్ణయాధికారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, మహాశక్తి నుంచి సీఈఓ రమీజా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

ప్రజాశక్తి-పెనుకొండ

ఆస్తి పన్ను వడ్డీ పై 50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగర పంచాయతీ ప్రజల ఆస్తి ఏక మొత్తంలో పన్ను చెల్లించి వడ్డీ పై రాయితీ పొందే అవకాశం ఏప్రిల్ 31వ తేదీ వరకు పొడిగించామన్నారు. పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ధర్మవరం టౌన్ : 2025 -26 సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు ఈనెల 30వ తేదీలోగా ఏక మొత్తంగా చెల్లించి పన్ను మొత్తములో 5 శాతం రాయితీని పొందాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు గడువులోగా పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రొద్దం


మండలంలోని బొక్సంపల్లి 220 కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా మండల పరిధి లోని పలు విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఈ శ్రీనివాసమూర్తి తెలిపారు.ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆరోగ్య సంరక్షణ పట్ల గర్భిణులు అవగాహన కలిగి ఉండాలని కదిరి ప్రాజెక్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత తెలిపారు. గురువారం కదిరి పట్టణంలోని ఆమీన్ నగర్ ఒకటోవ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణుల ఆరోగ్య సంరక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నిజాంవలి సెక్టార్ సూపర్‌వైజర్ మమత, అంగన్వాడీ కార్యకర్తలు అదెమ్మ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని కంచిసముద్రం అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిడిపిఒ శాంత లక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. బాల్య వివాహల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, కంచిసముద్రం ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్, అంగన్వాడీలు ఉమాదేవి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు